సాక్షి
నిజామాబాద్
ఆదివారం। 12। జనవరి। 2025



'ఉపాధి'లో నిర్లక్ష్యం వహిస్తే..

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీవో సాయాగౌడ్ హెచ్చరించారు.

- 10లో ▸



సంక్రాంతి తర్వాత..

సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వ్యవసాయ సలహాదారు పోచారం తెలిపారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /15.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వడ్డె ఓబన్న జయంతి



సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ధైర్యసాహసాలను కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి స్రవంతి, ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, పి వెంకటేష్, ఎత్తరి రాములు, నగేష్, శంకర్, బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్టీఏ సభ్యుడిగా నరేందర్ గౌడ్



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రాంతీయ రవాణా అథారిటీ సభ్యుడిగా కాంగ్రెస్ నాయకుడు నరేందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రవాణా అధికారులు నరేంద్ర గౌడ్‌కు నియామక పత్రం అందించారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సంతోషంగా పండుగ జరుపుకోవాలి



ఖలీల్‌వాడి: ప్రజలు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆమె శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రజలు, పోలీస్ సిబ్బంది సోదర భావంతో మెలగాలని కోరారు.

ఖిల్లా రామాలయంలో వీహెచ్‌పీ పూజలు



నిజామాబాద్ రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించి తిథి ప్రకారం ఏడాది అవుతున్న సందర్భంగా విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వందల మంది రామభక్తులతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి దాత్రిక రమేష్, నగర కార్యదర్శి రాంప్రసాద్ చెటర్జీ, భాసాల్లా నీకేష్, అఖిల్, ఇందూరు సురేష్, ఎండల సాయి, శివ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థి ఎంపిక

నిజామాబాద్ అర్బన్: ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లాకు చెందిన సానిక ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 41 మందిని ఎంపిక చేస్తూ శనివారం రక్షణ శాఖ అధికారులు జాబితా విడుదల చేశారు. ఇందులో ఆర్మూర్ బీసీ బాలికల కాలేజీకి చెందిన సానిక కూడా ఎంపికయ్యారు.

యువజన ఉత్సవాల ప్రతినిధిగా శైలి బెల్లాల్



నిజామాబాద్ నాగారం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఢిల్లీలో జరిగే యువజన ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల ప్రతినిధిగా జిల్లా యువజన అధికారి శైలిబెల్లాల్ నియమితులయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వివిధ పోటీలకు ఎంపికైన యువతి, యువకులకు ఆమె ఇన్‌చార్జీగా వ్యవహరిస్తారు. శనివారం ఆమె కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడుతో సమావేశమయ్యారు.

మహా కుంభమేళాలో సేవా కార్యక్రమాలు అందించేందుకు గాను జిల్లాకు చెందిన ఆశ్రమాల వారు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ కుంభమేళా ప్రపంచంలోనే అతిపెద్ద క్రతువుగా ప్రసిద్ధికెక్కింది. 42 రోజుల పాటు అన్నదానం ఇతర సేవల నిర్వహణకు ప్రయాగ్‌రాజ్‌లో లంగర్లు వేసుకున్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు జిల్లాకు చెందిన పలువురు వ్యాపారులు, భక్తులు ధన, వస్తు రూపేణా సహకరిస్తున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలూ ఆర్థిక సహాయం అందించారు. కుంభమేళా వద్ద ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా సాధువులకు స్టీల్ ప్లేట్లు, వస్త్ర సంచి అందించేందుకు జిల్లా నుంచి పలువురు తమవంతుగా విరాళాలు అందించారు.



ఇందూరు సేవలు

- ప్రయాగ్‌రాజ్‌లో అన్నదాన సేవలు ప్రారంభించిన శ్రీరామానందాచార్య ఆశ్రమం, శ్రీసీతారాంధాం సంత్ సేవాశ్రమం
- ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి తదితరుల సహకారం
- కుంభమేళా వద్ద ప్లాస్టిక్ నియంత్రణకు ఆర్‌ఎస్‌ఎస్‌కు సహకరించిన జిల్లావాసులు
- జిల్లా నుంచి పుణ్యస్నానాలకు వెళ్లనున్న భక్తులు

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మహా కుంభమేళా ప్రపంచంలో అతిపెద్ద క్రతువుగా ప్రసిద్ధికెక్కింది. ప్రపంచవ్యాప్తంగా సనాతన హిందువులు అత్యంత పవిత్రంగా భావించే ఈ కుంభమేళా సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కోట్లాది మంది భక్తులు పాల్గొనే ఈ క్రతువులో దేశం నలుమూలల నుంచి అనేకమంది అనేక సంస్థల ద్వారా అన్నదానం సహా ఇతర సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఇందూరు జిల్లాకు చెందిన సారంగపూర్‌లోని శ్రీరామానందాచార్య ఆశ్రమం పూర్వ పీఠాధిపతి మహంత్ శ్రీరమాపతి దాస్‌జీ శాస్త్రి, ప్రస్తుత పీఠాధిపతి మంగళదాస్‌జీ మహరాజ్ ఆధ్వర్యంలో, కందకుర్తిలోని శ్రీసీతారాంధామ్ సంత్ సేవాశ్రమం పీఠాధిపతి సీతారాం త్యాగి ఆధ్వర్యంలో ప్రయాగ్‌రాజ్‌లో 42 రోజుల పాటు అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహించేందుకు లంగర్లు వేసుకున్నారు. ఈ ఆశ్రమాల ద్వారా అందిస్తున్న సేవలకు గాను జిల్లా నుంచి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందరికంటే ముందుగా స్పందించారు. భారీ సహకారం అందించారు. తరువాత ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పలువురు వ్యాపారులు ఆర్థిక సహాయం అందించారు. వీరే కాకుండా ధన, వస్తు రూపేణా జిల్లా నుంచి పలువురు భక్తులు సైతం సహకరించారు. ఇక నగరానికి చెందిన మంచాల జ్ఞానేందర్ గుప్తా ఉత్తరప్రదేశ్‌లోని కాశీ మోక్షదాయక్ ట్రస్ట్‌కు తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలోనూ ప్రయాగ్‌రాజ్‌లో అన్నదానం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'తాలి జౌర్ థైల్' నినాదంతో కుంభమేళా వద్ద ప్లాస్టిక్ నియంత్రణకు కృషి జరుగుతోంది. ఇందులో భాగంగా సాధువులకు స్టీల్ ప్లేట్లు, వస్త్ర సంచి అందించేందుకు జిల్లా నుంచి పలువురు తమవంతుగా విరాళాలు అందించడం విశేషం.



ప్రయాగ్‌రాజ్ రైల్వేస్టేషన్ వద్ద కందకుర్తి ఆశ్రమ స్వామీజీలు

- సనాతన హిందూ ధర్మంలో ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే కుంభమేళాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రయాగ్‌రాజ్‌తో పాటు హరిద్వార్, నాసిక్, ఉజ్జయినిలలో కుంభమేళాను నిర్వహిస్తారు. ప్రస్తుత కుంభమేళా ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు నిర్వహించనున్నారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పుడు మహా కుంభం ప్రారంభమవుతుంది. హిందూ పురాణాల ప్రకారం మకర సంక్రాంతి నేపథ్యంలో కుంభస్నానం ప్రారంభమవుతుంది.

ప్రస్తుత కుంభమేళాలో జనవరి 13న (పౌష్య పూర్ణిమ), జనవరి 14న(మకర సంక్రాంతి), జనవరి 29న(మౌని అమావాస్య), ఫిబ్రవరి 3న(వసంత పంచమి), ఫిబ్రవరి 12న(మాఘ పూర్ణిమ), ఫిబ్రవరి 26న(మహా శివరాత్రి) రోజున చేసే స్నానాలను 'రాజ స్నానాలుగా' పిలుస్తున్నారు. ఈ ఆరు దినాల్లో చేసే స్నానాలకు సాధువులు, నాగసాధువులు దేశం నలుమూలల నుంచి వస్తారు. అంతరిక్షం నుంచి చూసినప్పటికీ ఈ కుంభమేళా కనిపిస్తుండడం విశేషంగా చెబుతారు. గంగ, యమున, అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదులు కలిసే ప్రయాగ్‌రాజ్ వద్ద చేసే స్నానానికి ప్రాముఖ్యత ఎక్కువ.



తమకు కేటాయించిన టెంట్‌లో కందకుర్తి ఆశ్రమ స్వామీజీలు,



ఎమ్మెల్యే ధన్‌పాల్ దంపతుల నుంచి విరాళం స్వీకరిస్తున్న సారంగాపూర్ ఆశ్రమ పీఠాధిపతి

144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా..

ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళా జరుగుతుండగా, 12 కుంభమేళాల తరువాత జరిగే మహా కుంభమేళాను ఈ తరం వాళ్లం చూడడం జన్మ ధన్యం. అంటే 144 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ కుంభమేళా అత్యంత గొప్పది. కుంభమేళా వద్ద పుణ్య స్నానం ఆచరించడం అనేది ప్రతి హిందువు కల. మహా కుంభమేళాలో పాల్గొనే అవకాశం ఈ తరానికి రావడం సాధారణ విషయం కాదు.

దాత్రిక రమేష్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి



శ్రీ పంచ్ తేరా భాయి కల్సాలో కొనసాగుతున్న అన్నదానం (ఇందూరు కల్సా)

సాగునీటి కోసం పాట్లు

- కాలువ వద్ద కాపలా కాస్తున్న ధర్మోరా రైతులు

బాల్కొండ: తలాపునే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సాగునీటి కోసం ఆ గ్రామ రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఎగువనే ప్రాజెక్ట్ ఉన్నా ఆ నీటి కోసం కాలువల వద్దనే వంతుల వారిగా కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. లక్ష్మి కాలువ డీ-3 ఆధారంగా నిర్మించిన వేంపల్లి ఎత్తిపోతల పథకం నీటి కోసం మోర్తాడ్ మండలం ధర్మోరా రైతులు ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో మైనర్ కాలువ వద్ద రాత్రి, పగలు కాపలా కాస్తున్నారు. లిఫ్ట్ నుంచి ఎల్-1 కాలువ ద్వారా ధర్మోరాకు నీటి సరఫరా చేపడుతారు. ఆ నీరు సరిపడ రాకపోవడంతో ఎల్-2 కాలువ, ఎంఎల్-4 నుంచి కూడా నీరు అవసరం అవుతోంది. కాలువ వెంట పొలాలు ఉన్న రైతులు గండ్లు కొట్టడం, మోటర్లు బిగించడంతో నీరు చివరికి చేరడం లేదు. దీంతో వాటిని అడ్డుకుని నీటిని చివరి ఆయకట్టుకు చేర్చడం కోసం రైతులు వంతుల వారీగా కాపలా కాస్తున్నారు.

లష్కర్ల కొరత

కాలువ వెంబడి తిరగాల్సిన లష్కర్లు తక్కువగా ఉండటం, ఉన్న వారికి నీటి పంపకాలపై అవగాహన లేకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రాజెక్ట్ నుంచి దూర ప్రాంతాలకు నీటి విడుదల చేస్తున్న అధికారులు స్థానిక రైతులకు సాగునీరు అందకున్నా పట్టించుకోవడం లేదు. ముందు ఉన్న రైతులే నీటిని తరలించుకుపోతున్నారు. చివర ఉన్న వారికి సాగు నీరు అందడం లేదు. నీటి పంపకాలను సమానంగా చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దీనిపై బాల్కొండ మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ సురేశ్‌ను వివరణగా ఎత్తిపోతల పథకం ద్వారా రైతులందరికి సమానంగా నీటి సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు. మూడు పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు.



వేంపల్లి శివారులో కాలువ వద్ద కాపలా కాస్తున్న ధర్మోరా రైతులు

గ్రామ, వార్డు సభలకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి గ్రామ, మున్సిపల్ వార్డు సభల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పథకాలను అమల్జేయాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో, చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ శనివారం జూమ్ మీటింగ్ ద్వారా దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా పథకం కింద పట్టా పాస్ పుస్తకాలు ఉన్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం జమ చేస్తుందన్నారు. భూ భారతి(ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 20లోపు క్షేత్రస్థాయి సందర్శన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో వివరాలు వెల్లడిస్తూ, గ్రామ సభ ఆమోదం తర్వాత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు అందించేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. 2023–24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసిన వ్యవసాయ కూలీ కుటుంబాలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపులో ఎంపీడీవోలు, ఏపీవోలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులు జారీ విషయంలోనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తలసరి ఆదాయం, భూమి కలిగిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించడమే కాకుండా, మార్పులు చేర్పులను సైతం చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేయాలన్నారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని పేర్కొన్నారు. అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కిక్కిరిసిన మేకల సంత

- రూ. 4 కోట్ల లావాదేవీలు..
- సంక్రాంతి ప్రభావం



నవీపేట : నవీపేట మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసింది. మంగళ, బుధవారాలలో సంక్రాంతి భోగి, కనుమ పండగ సంబరాలు జరుగనుండటంతో ఒక్కసారిగా క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. కనుమ రోజున ప్రత్యేకంగా మాంసాహార విందు భోజనానికి ఆనవాయితీగా ప్రాధాన్యతనివ్వడంతో మేకల సంతలో సందడి నెలకొంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వ్యాపారులు శుక్రవారం రాత్రే సంతకు చేరుకున్నారు. సంత ప్రాంగణం ఇరుకుగా ఉండగా, బాసర రహదారికి ఇరువైపుల క్రయవిక్రయాలు జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సంతలో రూ. 4 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- మండలాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత

సుభాష్‌నగర్: జిల్లాలో రాబోయే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మండలాల నూతన అధ్యక్షులు పని చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. జిల్లాలోని ఆయా మండలాలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారికి ఎంపీ అర్వింద్ హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం నియామకపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, మండలాల అధ్యక్షులతో ఎంపీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ జిల్లాలో బీజేపీ మరింత బలోపేతానికి తమవంతు కృషి చేయాలని సూచించారు. జెడ్పీ, కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లు, గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నేహశ్రీ

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన నేహశ్రీ జాతీయస్థాయి సీనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని శనివారం తెలిపారు. ఈ నెల 5న మనోహరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెలెక్షన్ టోర్నమెంట్‌లో విద్యార్థి చక్కని ప్రతిభ కనబర్చి, ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నేహశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నేహశ్రీని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్‌లు స్వప్న, వనిత, ఫిజికల్ డైరెక్టర్ జోత్స్న, పీఈటీ శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ మౌనిక, అధ్యాపకులు తదితరులు అభినందించారు.



నేహశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నళిని, అధ్యాపకులు

క్లుప్తంగా

జీజీహెచ్‌ పరిస్థితులపై ధన్‌పాల్‌ ఆగ్రహం

- అక్రమాలపై విచారణ చేయించాలని కలెక్టర్‌కు వినతి

నిజామాబాద్‌ నాగారం: ఫిట్స్‌తో బాధపడుతున్న తన భార్యను శుక్రవారం చికిత్స కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చిన వ్యక్తికి సిబ్బంది చుక్కలు చూపించిన ఘటన చర్చనీయాంశమైంది. స్ట్రెచర్‌ను తీసుకొచ్చే సిబ్బంది పట్టించుకోకపోవంతో రోగిని బంధువులే భుజాలపై వేసుకుని ఆస్పత్రిలోనికి మోసుకెళ్లారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ చేయాల్సిన ఆస్పత్రి అధికారులు పట్టింపులేకుండా వ్యవహరించారు. జీజీహెచ్‌లో నెలకొన్న పరిస్థితులపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో అక్రమాలపై విచారణ చేయించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు విన్నవించారు. 2023 డిసెంబర్‌ నుంచి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు, ఖర్చులు, గతేడాది అన్ని విభాగాల్లో అవుట్‌ సోర్సింగ్‌ ద్వారా రిక్రూట్‌ అయిన ఉద్యోగుల సమాచారాన్ని సేకరించాలని కోరారు. వైద్య పరికరాల సేకరణ కోసం నిర్వహించిన వేలం, బయోమెట్రిక్‌ యాక్సెస్‌ చేసిన ప్రదేశాలతో సహా గత మూడు నెలల నుంచి అన్ని విభాగాల అధిపతులు, కాంట్రాక్ట్‌ వైద్యులకు బయోమెట్రిక్‌ నివేదికలు, కొంత మంది వైద్యులు హైదరాబాద్‌ వంటి ప్రాంతాల నుంచి బయోమెట్రిక్‌ యాక్సెస్‌ చేస్తున్నారన్నారు. అంతర్గత సిబ్బంది, అంబులెన్సులు, నగరంలోని రెండు ప్రైవేట్‌ ఆస్పత్రులకు రిఫర్‌, రాత్రి వేళల్లో అల్ట్రా సానోగ్రఫీ చేయకపోవడం, రేడియాలజిస్టులు అందుబాటులో ఉంటున్నారా?, పోస్టుమార్టం రిపోర్టులు ఆలస్యం చేయడం, ఆరోగ్యశ్రీ నిధులు, రూ.10కోట్ల నష్టం తదితర అంశాలపై విచారణ చేయించాలని కోరారు.

సోషల్‌ టీచర్ల ఎడ్యుకేషన్‌ టూర్‌



బోధన్‌: పట్టణంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీసీ) స్కూల్‌ కాంప్లెక్స్‌ పరిధిలోని సోషల్‌ సబ్జెక్టు టీచర్లు శనివారం ఎడ్యుకేషన్‌ టూర్‌లో భాగంగా క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వరంగల్‌ జిల్లాలోని కాకతీయుల కోట, వెయ్యి స్తంభాల గుడి, లక్నవరం చెరువు, రామప్ప గుడిని సందర్శించారు. స్కూల్‌ కాంప్లెక్స్‌ కార్యదర్శి సంజీవ్‌ కుమార్‌, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్‌, శ్రీలక్ష్మి, బాలాజీ, అబ్బయ్య, రాజన్న, కిశోర్‌, స్వరూపారాణి, పద్మజ్యోతి, శిరీష, శ్యామల, లీల తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కోసం మాధవరావు పోరాటం



నిజామాబాద్‌ సిటీ: మానవ హక్కుల ఉద్యమకారుడు గొర్రెపాటి మాధవరావు జీవితాంతం పీడిత ప్రజల కోసమే పోరాడారని, ఆయన జీవితం పీడిత ప్రజలకే అంకితమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలోని మాధవరావు నివాసంలో సంస్మరణ సభ నిర్వహించారు. మాధవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

న్యాయవాదిగా నకిలీ ఎన్‌కౌంటర్‌ బాధితులకు కోర్టు ద్వారా నష్టం ఇప్పించిన ఘనత మాధవరావుదేనని అన్నారు. తన రచనలతో ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాల వైపు నడిపించారన్నారు. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అవపోసాన పట్టిన గొప్ప మేధావి గొర్రెపాటి మాధవరావు అని కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కృష్ణ, వేములపల్లి వెంకటరామయ్య, జీవన్‌ కుమార్‌, ఆకుల పాపయ్య, జంపాల చంద్రశేఖర్‌ ప్రసాద్‌ ట్రస్ట్‌ సభ్యులు, మానవ హక్కుల వేదిక నాయకులు, సీపీఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ నాయకులు, వామపక్షాల నాయకులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

పసుపు సాగుకు ప్రోత్సాహం!

- చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న అధ్యయన బృందం



పసుపు విత్తే యంత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డి, తదితరులు(ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): పసుపు సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డితో పాటు సభ్యులు, అధికార యంత్రాంగం జిల్లాలో ఒక రోజు క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. వ్యవసాయ కమిషన్‌ సూచనలతో పసుపు సాగులో తీసుకు రావాల్సిన మార్పులపై అధ్యయనం చేయడానికి త్వరలోనే బృందం పర్యటించనుందని సమాచారం. పసుపు సాగుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న నిజామాబాద్‌ రైతాంగానికి సరైన ప్రోత్సాహం అందించడానికి కార్యాచరణ రూపొందించే అవకాశం కనిపిస్తుంది. గతంలో ప్రతి ఏటా 50వేల ఎకరాల్లో సాగైన పసుపు కొన్నేళ్ల నుంచి 25వేల ఎకరాలకే పరిమితమైంది. దేశంలో సాగు అయ్యే పసుపు మొత్తంలో 25 శాతం పసుపు పంట నిజామాబాద్‌, నిర్మల్‌, జగిత్యాల జిల్లాల్లోనే సాగు అయ్యేది. సాగు ఖర్చులు పెరగడం, ఆశించిన ధర లభించకపోవడంతో రైతులు క్రమ క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గిస్తూ వచ్చారు. ఇలాగే కొనసాగితే పసుపు పంట కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట్‌ అన్వేష్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు వ్యవసాయ కమిషన్‌ పసుపు సాగుపై వివరాలను నమోదు చేయాలని నిర్ణయించింది. రెండు రోజుల కింద కమిషన్‌ బాల్కొండ, మోర్తాడ్‌, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల్లో పర్యటించి పసుపు క్షేత్రాలను పరిశీలించింది. పసుపు పరిశోధన కేంద్రంలోను కమిషన్‌ చైర్మన్‌ సందర్శించి రైతులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారో తెలుసుకున్నారు. నిజామాబాద్‌లో పసుపు సాగు చేసే రైతులతో సమావేశం నిర్వహించారు.

మార్పులు తీసుకువస్తే..

కీలకమైన మార్పులు తీసుకవస్తేనే పసుపు సాగు విస్తీర్ణం పెరిగి పూర్వవైభవం సంతరించుకుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పసుపు సాగు చేసే రైతులకు యంత్రాలను రాయితీపై అందించడం, నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, సేంద్రియ ఎరువులు తక్కువ ధరకు అందించే విస్తృతమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందనే వినతులు కమిషన్‌కు అందాయి. సాగు ఖర్చులు తగ్గి, లాభాలు పెరిగితే పసుపు సాగు గతంలో మాదిరిగానే పెరిగే అవకాశం ఉంది. ఎగుమతులకు అవకాశం ఉన్నా సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ఉన్న పంట ఇక్కడే విక్రయం జరుగుతుంది. ఎగుమతులు పెరగాలంటే అందుకు అనుగుణంగా మార్కెట్‌కు పంట దిగుబడి రావాల్సి ఉంది.

ప్రభుత్వానికి నివేదిక



పసుపు రైతులను ప్రోత్సహించడమే ప్రధానమైన అంశం. సరైన ప్రోత్సాహకాలు అందకపోవడంతోనే సాగు తగ్గిపోతోంది. వీటిని పరిగణలోకి తీసుకుని వ్యవసాయ కమిషన్‌ పసుపు పంట సాగు చేసే గ్రామాలనే సందర్శించింది. రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించనుంది. – సుంకెట్‌ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌

బడాపహాడ్‌ ఉర్సు ప్రారంభం



గంధాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు



ఉర్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: వర్ని మండలంలోని బడాపహాడ్‌ ఉర్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. మండలంలోని జలాల్పూర్‌లో దర్గా పూజారుల ఇంటి నుంచి ఉర్సు నైవేద్యాన్ని తీసుకువచ్చి గ్రామ చావిడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కవ్వాలి ఇతర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ప్రార్థనలు నిర్వహించి షాదుల్లా బాబాకు సమర్పించే నైవేద్యాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌ రెడ్డి తలపై పెట్టుకుని ఉర్సు ప్రారంభించారు. ఉర్సు గంధాన్ని (నైవేద్యం) ఒంటి, గుర్రంపై ఉంచి జలాల్పూర్‌ నుంచి బడాపహాడ్‌ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం బడా పహాడ్‌ దర్గాపై ఉన్న శాదుల్లా బాబాకు సమర్పించారు. సోమవారం వరకు ఉత్సవాలు జరగనున్నాయి. కాగా తొలిరోజు ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు. ఇటీవల దర్గా వద్ద పూజారుల దోపిడీ, కనీస సౌకర్యాలు లేకపోవడంతో బడాపహాడ్‌కు భక్తులు రావడానికి మొగ్గు చూపడం లేదు. ఉత్సవాల సందర్భంగా గుట్ట వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో వక్ఫ్‌ బోర్డు విఫలమైంది.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నిశిత కళాశాలలో డ్యాన్స్‌ చేస్తున్న విద్యార్థులు



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుభాష్‌నగర్‌: నగరంలోని నిశిత డిగ్రీ కళాశాల (అటానమస్‌)లో శనివారం పూర్వ విద్యార్థుల (1994 నుంచి 2024 బ్యాచ్‌లు) సమ్మేళనాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 20 ఏళ్లలో కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ స్నేహితులతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కళాశాల చైర్మన్‌ నిఖిల్‌, చీఫ్‌ ప్యాట్రన్‌ వినయ్‌, డైరెక్టర్‌ పూజ, కోఆర్డినేటర్‌ రాజు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ స్వప్న, వైస్‌ ప్రిన్సిపాల్‌ రఘువీర్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి తరువాత లబ్ధిదారుల ఎంపిక

వర్ని: సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. వర్ని, పొతంగల్‌ మండల కేంద్రాల్లో శనివారం పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులు వర్నిలో ఏర్పాటు చేసిన నమూనా ఇల్లు(ఇందిరమ్మ ఇళ్లు) పనికి భూమిపూజ చేసి నిర్మాణ నమూనాను ఆయన పరిశీలించారు. అనంతరం వర్ని, చందూర్‌, మోస్రా మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

రుద్రూర్‌: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పొతంగల్‌ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను అందజేశారు. పొతంగల్‌ మండలానికి చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షలు మంజూరైనట్లు పోచారం తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ సురేందర్‌నాయక్‌, కోటగిరి మార్కెట్‌ కమిటీ అధ్యక్షుడు గైక్వాడ్‌ హన్మంతు, మాజీ జెడ్పీటీసీ శంకర్‌ పటేల్‌, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్‌, గంధపు పవన్‌కుమార్‌, జెడ్పీ మాజీ కో ఆప్షన్‌ సభ్యుడు సిరాజ్‌, వలియొద్దీన్‌, ఏఎంసీ మాజీ చైర్మన్‌ నీరడి గంగాధర్‌, కేశ వీరేశం, షాహిద్‌ పాల్గొన్నారు.



పొతంగల్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

‘ఉపాధి’లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నివేదిక చదివి వినిపిస్తున్న విలేజ్‌ సోషల్‌ ఆడిటర్లు

బాల్కొండ: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో సాయాగౌడ్‌ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం 16వ సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చేపట్టిన పనులపై గత వారం రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను విలేజ్‌ సోషల్‌ ఆడిటర్లు చదివి వినిపించారు. ప్రధానంగా గ్రామాల్లో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మొక్కలు నాటక పోవడం, వన సేవకులకు వేతనాలను అందకపోవడాన్ని గుర్తించారు. మస్టర్లలో కూలీల సంతకాల సేకరణలో జాప్యం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. డీఆర్డీవో సాయాగౌడ్‌ మాట్లాడుతూ.. కూలీలందరికీ పని దినాలు కల్పించాలని, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. మస్టర్లలో సంతకాలు తీసుకోని పలువురు ఫీల్డ్‌ అసిస్టెంట్లకు జరిమానా విధించారు. జిల్లా విజిలెన్స్‌ అధికారి నారాయణ, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్‌ శ్రీధర్‌, ఏపీవో ఇందిర, ఎస్‌ఆర్పీ రమేశ్‌, టీఏలు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అధికారులు వచ్చారు, నివేదిక చదివారు, వెళ్లిపోయారు అన్నట్లు ప్రజావేదిక నిర్వహించారని పలువురు పెదవి విరిచారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ ముగింపు



శిక్షణ పొందిన కేడెట్లతో లెఫ్టినెంట్‌ కల్నల్‌ విష్ణుప్రసాద్‌ నాయర్‌

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జాన్కంపేట్‌ సీటీసీలో 12వ తెలంగాణ బెటాలియన్‌ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని లెఫ్టినెంట్‌ కల్నల్‌ విష్ణుప్రసాద్‌ నాయర్‌ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. క్యాంప్‌లో నిజామాబాద్‌, కరీంనగర్‌, ఆదిలాబాద్‌, సంగారెడ్డికి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగింది. కేడెట్లు రానున్న ఎగ్జామ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి గ్రేడింగ్‌ సాధించాలని లెఫ్టినెంట్‌ కల్నల్‌ అన్నారు. ముగింపు కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టీబీ స్క్రీనింగ్‌పై ప్రయాణికులకు అవగాహన



నిజామాబాద్‌నాగారం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో హౌస్‌కీపింగ్‌ సిబ్బందికి, ప్రయాణికులకు టీబీ స్క్రీనింగ్‌ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైల్వే వైద్యాధికారిణి దీప మాట్లాడుతూ.. ప్రయాణికులు టీబీ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ టీబీ లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో టీబీ, హెచ్‌ఐవీ కో ఆర్డినేటర్‌ రవిగౌడ్‌, రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ప్రేమ్‌, పీపీటీసీ కౌన్సిలర్‌ రాధ, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో : ముగ్గురికి గాయాలు



బాధిత మహిళను పరామర్శిస్తున్న కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామసమీపంలో వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఓ ఆటో శనివారం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన పలువురు మహిళాకూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలో శనివారం ఉదయం మాల్తుమ్మెద గ్రామానికి బయల్దేరారు. ఆటో మాల్తుమ్మెద గ్రామ సమీపంలోకి చేరుకున్న తర్వాత అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో సునీత అనే మహిళకు తీవ్రగాయాలు కాగా, భాగ్యలక్ష్మి, లావణ్య అనే మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. సునీతను మెరుగైన చికిత్స కోసం మెదక్‌ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాంగ్రెస మండలాధ్యక్షుడు, ధర్మారెడ్డి గ్రామ మాజీసర్పంచ్‌ శ్రీధర్‌గౌడ్‌ మండల కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. ఆయనవెంట యూత్‌కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు శ్రీరాంగౌడ్‌ ఉన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్‌

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ గ్రామానికి చెందిన వ్యక్తిని పరామర్శించేందుకు నిజాంసాగర్‌ మండలం గోర్గల్‌ గ్రామానికి చెందిన పీరని కాశయ్య (40) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బైక్‌పై రాత్రి 9 గంటల సమయంలో బయల్దేరాడు. శనివారం రాత్రి 10 గంటల సమ యంలో ప్రమాదవశాత్తు ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైకు అదుపుతప్పి మట్టి కుప్పలను ఢీకొట్టి రాళ్లపై పడి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. శనివారం సాయంత్రం వర్ని చౌరస్తా మీదుగా ప్రయాణిస్తుండగా సాయినగర్‌కు చెందిన పీర్‌సింగ్‌(35) వస్తుండగా ఎదురుగా వచ్చిన బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన పీర్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపల వేటకు వెళ్లి..



మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న గజ ఈతగాళ్లు

రామారెడ్డి: మండలంలోని భట్టుతండా చెరువులో చేపలను వేటాడేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భట్టు తండా గ్రామానికి చెందిన రమావత్‌ రవీందర్‌(28) శుక్రవారం మధ్యాహ్నం చెరువులో చేపలను వేటాడేందుకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికులతోపాటు జాలర్లు శుక్రవారం మధ్యాహ్నం నుంచి గాలించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. శనివారం మధ్యాహ్నం గజ ఈతగాళ్లకు రవీందర్‌ మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఇద్దరు భార్యలు కాగా, పెద్ద భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మురికి కాలువలో పడి మృతి

ధర్పల్లి: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని హొన్నాజీపేట్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అంతే జగదీశ్వర్‌(42) కూలి పని చేస్తూ జీవించేవాడు. గొడవ కారణంగా నాలుగేళ్ల క్రితం భార్య అతడిని వదిలి కూతురితో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జగదీశ్వర్‌ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన జగదీశ్వర్‌.. మళ్లీ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం మురికి కాలువలో జగదీశ్వర్‌ మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. మృతుడి తల్లి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట: మండలంలోని జన్నేపల్లికి చెందిన షేక్‌ కరీమాబీ(66) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ శనివారం తెలిపారు. ఈనెల 10వ తేదీన జన్నేపల్లి గ్రామంలోని రహదారిపై వెంట కరీమాబీ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్‌ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన కరీమాబీని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. మృతురాలి మనవడు నిఖత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్‌ బస్టాండ్‌ ప్రాంతంలో పీడీఎస్‌ బియ్యాన్ని ఒకటో టౌన్‌ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఆటోలో తరలిస్తున్న 9క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని ఆటోను ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

ఇసుక టిప్పర్‌, ట్రాక్టర్‌ ..

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి సమీపంలో ఉన్న మొఘల్‌పూర్‌, బోధన్‌ మండలం కొప్పర్గ నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌తోపాటు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా వాహనాలు పట్టుబడడంతో స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగిస్తామని తెలిపారు.

అటవీ భూమిని ఆక్రమించిన వారిపై కేసు

సిరికొండ: సిరికొండ రేంజ్‌ పరిధిలోని రాంచంద్రపల్లి బీట్‌ కంపార్ట్‌మెంట్‌ నంబర్‌ 391లో అటవీ భూమిని ఆక్రమించిన చింతల్‌తండాకు చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి రేంజర్‌ రవీందర్‌ శనివారం తెలిపారు. అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గౌతంనగర్‌కి చెందిన ఎనుగందుల పవన్‌కుమార్‌ కు చెందిన కారును దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. పవన్‌కుమార్‌ ఈనెల 9న రాత్రి హైదరాబాద్‌కు వెళ్తూ ఇంటి ముందు ఐ10 కారును పార్క్‌ చేశాడన్నారు. హైదరాబాద్‌ నుంచి వచ్చిన ఆయనకు కారు కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడన్నారు. అయినప్పటికీ కారు లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు.

కోటగిరిలో పశువుల పాక దగ్ధం

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో పశువుల పాక దగ్ధమై 18 గేదెలకు గాయాలయ్యాయి. షేక్‌ హైమద్‌కు చెందిన పశువుల పాకకు శుక్రవారం రాత్రి మంటలు అంటుకోవడంతో గమనించిన స్థానికులు వెంటనే ఆయనకు సమాచారం అందించారు. ఐదు గేదెలకు తీవ్రగాయాలు కాగా, 13 గేదెలకు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం ఉదయం మండల పశువైద్యాధికారి సురేశ్‌కుమార్‌ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి అగ్ని ప్రమాదంలో గాయపడిన పశువులకు చికిత్స అందించారు.

పేకాటస్థావరాలపై దాడులు

మోర్తాడ్‌(బాల్కొండ): మండలంలోని ధర్మోరా, గాండ్లపేట్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ధర్మోరా శివారులోని పేకాటస్థావరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.5,930 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గాండ్లపేట్‌ శివారులో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.77,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఎక్సెల్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్‌

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పెద్ద పొతంగల్‌ బస్‌స్టాప్‌ వద్ద ట్రాక్టర్‌ ఎక్సెల్‌ వాహనాన్ని ఢీకొట్టింది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎక్సెల్‌ నడుపుతున్న పెద్ద బీరయ్యకు గాయాలైనట్లు 108 అంబులెన్స్‌ సిబ్బంది ఈఎంటీ కమలాకర్‌, పైలెట్‌ నరేశ్‌ తెలిపారు. సీతాయిపల్లికి చెందిన పెద్దబీరయ్య గాంధారికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని, బీరయ్య తల, చెవికి గాయాలయ్యాయన్నారు. బీరయ్యను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించామని, బాధితుని వద్ద లభించిన రూ.6వేల నగదును ఆయన బంధువు రమేశ్‌కు అప్పగించామని తెలిపారు.

బైక్‌ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఎడపల్లి (బోధన్‌): మండలంలోని ఠాణాకలాన్‌ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌, లోకేశ్‌ బైక్‌పై స్వగ్రామం నుంచి జాన్కంపేట్‌ వైపు వెళ్తుండగా జాన్కంపేట శివారులో ఉన్న జిల్లా పోలీస్‌ శిక్షణా కేంద్రం వద్ద బైక్‌ అదుపు తప్పింది. రోడ్డుపై పడిపోయిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.